

ఉపాధ్యాయుల 'సర్దుబాటు' వివాదం



- ఈనెల 13లోపు పూర్తి చేయాలని విద్యాశాఖ ఆదేశాలు
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు
- నెలాఖరు వరకు వాయిదా వేయాలని డిమాండ్

జిల్లాలో ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు ఇలా..

స్కూల్ కేటగిరి	పాఠశాల సంఖ్య	విద్యార్థుల సంఖ్య	ఉపాధ్యాయుల సంఖ్య	నిష్పత్తి
ప్రాథమిక పాఠశాలలు	515	18,097	1,188	15:1
ప్రాథమికోన్నత పాఠశాలలు	85	4,663	432	10:1
ఉన్నత పాఠశాలలు	220	35,916	2,441	14:1
మొత్తం	820	58,676	4,061	14:1

జగిత్యాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్న ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ఓ వైపు పాఠశాలలు పునః ప్రారంభం కాలేదు.. విద్యార్థుల ప్రవేశాలపై స్పష్టత రాలేదు.. మరోవైపు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఈనెల 13వ తేదీ లోపు ఉపాధ్యాయుల సర్దుబాటు ఏ ప్రాతిపదికన చేస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్న సమయంలో సర్దుబాటు చేస్తే విద్యార్థుల తల్లిదండ్రుల్లో నమ్మకం కోల్పోతామని చెబుతున్నారు. తక్షణమే ఉత్తర్వులను రద్దు చేయాలని, కనీసం జూన్ 30 వరకు వచ్చిన ప్రవేశాల ఆధారంగా సర్దుబాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 820 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో గత విద్యా సంవత్సరం వరకు 58,676 మంది విద్యార్థులు ప్రవేశాలు పొంది ఉన్నారు. 4,061 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో సగటున 15 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు బోధన బాధ్యతలు చేపడుతున్నారు.

● ఇవీ నిబంధనలు..

మొదటి ప్రాధాన్యం పంచాయతీ పరిధి, తర్వాత స్కూల్ కాంప్లెక్స్, ఆ తర్వాత మండలం, అనంతరం జిల్లా పరిధిలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేసుకోవచ్చు. వీటితో పాటు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా చేయాలనే నిబంధనలున్నాయి. పరస్పర బదిలీలకు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశమివ్వొద్దు. ఈ ప్రక్రియలో గత యూడైస్ వివరాలను ప్రతిపాదికగా తీసుకోనున్నారు. 10 మంది లోపు విద్యార్థులున్న పాఠశాలలకు ఒకరు, 60 లోపు ఇద్దరు, 90 లోపు ముగ్గురు, 120 లోపు నలుగురు, 150 వరకు అయిదుగురు, 200 లోపు విద్యార్థులుంటే ఆరుగురు ఉపాధ్యాయులుండాలని, 200 దాటిన తర్వాత ప్రతి 40 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

● ఆచరణలో సాధ్యం కాదంటున్న ఉపాధ్యాయులు..

విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం 60 మంది విద్యార్థులుంటే ఇద్దరు ఉపాధ్యాయులు సరిపోతారు. కానీ ఇది ఆచరణలో సాధ్యం కాదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మొత్తం 18 సబ్జెక్టులను ఇద్దరు ఎలా బోధిస్తారని, విద్యార్థులకు న్యాయం ఎలా జరుగుతుందని ఉపాధ్యాయ వర్గాలు వాదిస్తున్నాయి. బోధనతో పాటు అనేక...

మిగతా 8లో

6న జాబ్ మేళా

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈ నెల 6న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సత్తెమ్మ తెలిపారు. మారుతీ సుజుకీ, ఆదర్శ నెక్సా లో రెసిడెంట్ రిలేషన్ మేనేజర్, సీనియర్ రిలేషన్ షిప్స్ మేనేజర్ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఈ ఉద్యోగాలు డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, డిప్లమా అర్హత అన్నారు. ఇంగ్లీషులో పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు 6వ తేది ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించే జాబ్‌మేళాకు రెస్యూమ్‌తో పాటు సంబంధిత అర్హత ధ్రువ పత్రాలతో హాజరు కావాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయ సముదాయ భవనంలోని రూం నెంబర్ 218 ఎంప్లాయిమెంట్ అధికారి కార్యాలయంలో హాజరుకావాలని కోరారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మల్యాల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, గణితం, బయోలజీ, బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ గెస్ట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మానస తెలిపారు. ఈనెల 10వ తేదీ లోపు 98665 59701 లేదా ప్రిన్సిపాల్.టీఎస్ఆర్ఎస్. తాటిపల్లి జీమెయిల్.కాం అనే మెయిల్‌కు పంపించాలని సూచించారు. డెమో ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



పెద్దాపూర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి రూరల్, జూన్, 3 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో రేవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సును పరిశీలించారు. రెవెన్యూ సదస్సులో రైతులు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తున్న విధానాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లి డివిజన్‌లోని అన్ని మండలాలలోని రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 20 వరకు నిర్వహిస్తామన్నారు. రెవెన్యూ అధికారులు బృందాల వారీగా సందర్శించి రైతుల దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తు చేసుకునే రైతులు సంబంధిత భూపత్రాలు జతపరిచి అధికారులకు అందజేయా లన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ కాంతయ్య, సిబ్బంది, పాల్గొన్నారు.

● ఇబ్రహీంపట్నం: మండలంలోని ఫకీర్ కొండాపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సును కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడారు. భూ సమస్యలపై నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో తమతమ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ప్రసాద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

'బడిబాట'ను విజయవంతం చేయాలి

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. పట్టణం లోని స్థానిక పొన్నాల గార్డెన్‌లో పీఆర్టీయూ టీఎస్ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనందరావు, అమర్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సెస్సీ ప్రతిభ అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో డైట్‌కళాశాల ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సంద ర్భం గా మండల టాపర్ విద్యార్థులను సన్మానించారు. వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల 153 మంది ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి, జిల్లా విద్యాధికారి రాము, వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మెన్ మహేందర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, సంఘ మండల, జిల్లా బాధ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గెజిటెడ్ హోదా కల్పించాలి

24యేళ్ల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులకు గెజిటెడ్ హోదా ఇవ్వాలని కోరుతూ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు బాధ్యులు వేల్పుల స్వామి యాదవ్, చంద సత్యనారాయణలు టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. 1/2005 యాక్ట్ రద్దు చేసి భాషోపా ధ్యాయులకు నియామకం తేదీ నుంచి నోషనల్ సర్వీస్ ప్రొటెక్షన్ కల్పించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలో హిందీని ప్రవేశపెట్టి, తెలుగు, హిందీ పండిట్‌లను నియమించాలన్నారు. భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

● ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు సత్తా చాటాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని బ్రాహ్మణ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ సంస్థాగత సమావేశంలో పరిశీలకులు కత్తి వెంకటస్వామి, వైద్యుల అంజన్‌కుమార్‌తో కలిసి మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని పలు మండలాలకు నూతన అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు ఆసక్తి కలిగి ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం విప్ మాట్లాడుతూ పార్టీ పదవులపై అధిష్ఠానం సూచన మేరకు నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, వెలగటూర్, పెగడపల్లి మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు తాటిపర్తి శైలైందర్‌రెడ్డి, బుర్ర రాములుగౌడ్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్యలక్ష్మణ్, వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్దే లక్ష్యం

● జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రోడ్లు అభివృద్ధి చెందితేనే పట్టణం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణంలోని 2, 18, 17 వార్డుల్లో రూ.25 లక్షల నిధులతో బీటీ రోడ్డు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అనంతరం రైసింగ్ తెలంగాణ 2047 కార్యక్రమంలో భాగంగా వంద రోజుల పట్టణ ప్రణాళిక అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని, నియోజక వర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. 16 కోట్లతో పాత బస్టాండ్ నుంచి తిప్పన్నపేట వరకు బ్లాక్ స్పాట్ రోడ్డు కోసం 16.5 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. కార్యక్రమంలో కమిషనర్ స్పందన, మాజీ మున్సిపల్ చైర్మన్ జ్యోతి, మాజీ కౌన్సిలర్‌లు బద్దం లత, చుక్క నవీన్, బాలె శంకర్, నాగయ్య, శరత్‌రావు, ముస్కు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

జగిత్యాల అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని 18వ వార్డుకు చెందిన బోగ రాజేశ్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం రెండున్నర లక్షల ఎల్‌వోసీని మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ బాధితుని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ డైరెక్టర్ చెట్‌పెల్లి సుధాకర్, మాజీ కౌన్సిలర్ కూతురు రాజేశ్, రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● అదనపు కలెక్టర్ లత



ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లత

కోరుట్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ లత అన్నారు. తడి, పొడి చెత్తను మున్సిపల్ వాహనాలకు ఇంటి యజమానులు, దుకాణదారులు అందించాలని ఆమె సూచించారు. మంగళవారం పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న వంద రోజుల కార్యచరణ కార్యక్రమాలను మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కోరుట్ల పట్టణంలోని ఫిల్టర్ బెడ్‌తో పాటు వివిధ వార్డులలో నిర్వహిస్తున్న పనులను మున్సిపల్ ప్రత్యేక అధికారి లత పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, అశోక్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్, మెప్మా టీఎంసి శ్రీరాంగౌడ్, సిఓలు వార్డు అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

● జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్



విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారులు

కొడిమ్యాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులను పొందాలని డీఏవో వి. భాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని పూడూర్ రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలు వాతావరణ ఆధారిత పంటల సాగుపై రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఏవో వి.భాస్కర్ మాట్లాడుతూ వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి సేకరించిన ధాన్యానికి కొన్ని సాంకేతికతలను పాటించినట్లయితే రెండు మూడు సంవత్సరాల వరకు అదే ధాన్యంను వినియోగించుకోవచ్చునన్నారు. పంటల సాగులో నాణ్యమైన విత్తనం పాత్రను గుర్తించి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం అనే వినూత్న కార్య క్రమం చేపట్టిందన్నారు. అంతక ముందు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ శ్రీలతతో కలిసి మండలంలోని 30 మంది అభ్యుదయ రైతులకు వరి విత్తన కిట్లు(జేజీఎల్ 24423), 15పెసర విత్తన కిట్లు (ఎంజీజీ 295)నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ శ్రీలత, ఉద్యాన అధికారి శ్యాంప్రసాద్, మండల మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.ఏ ఇందూజ. మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి, పూడూర్ సింగిల్ విండో చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ నాగభూషణ్‌రెడ్డి, ఏఈవోలు శ్రీలత, గ్రీష్మ, ప్రశాంత్ పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజన కిట్లు అందజేత

రాయికల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారం భించిన విశ్వకర్మయోజనపథకం కింద భూపతిపూర్ ఉపసర్పంచ్ అన్నవేణి వేణు మంగళవారం 200మంది లబ్ధిదారులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా రాయికల్ సబ్ పోస్టు మాస్టర్ రాజు చేతుల మీదుగా కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుండోజి లక్ష్మీనా రాయణ, సంకోజిశేఖర్, గుండోజి రాజేందర్, గుండోజి గంగాధర్‌లకు కిట్లు పంపిణీ చేశారు.

ఏసీబీ వలలో రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్

- భూమి రిజిస్ట్రేషన్‌కు రైతు నుంచి రూ.15 వేలు లంచం డిమాండ్
- డాక్యుమెంట్ రైటర్ ద్వారా రూ.10వేలు తీసుకుంటుండగా పట్టివేత

6

నరసింహస్వామి హుండీ లెక్కింపు

కొడిమ్యాల, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగొండ గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం హుండీ లెక్కింపును అధికారులు, సిబ్బంది నిర్వహించారు. స్వామి వారి హుండీల్లో 4,87,687 రూపాయల నగదు భక్తుల నుంచి ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఉడుతల వెంకన్న తెలిపారు. మిశ్రమ బంగారం 3గ్రాంలు, మిశ్రమ వెండి 520 గ్రాంలు వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకులు పి. సత్యనారాయణ, అర్చకులు శ్రీనివాసాచార్యులు, మనోజ్ కుమారాచార్యులు, సిబ్బంది రవి, కమలాకర్, కొమురయ్య, కరీంనగర్ అన్నమయ్య సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కోరుట్ల రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వర్షా కాలం సీజన్ వ్యాధులు సోకకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. మంగళవారం మండల సమావేశమందిరంలో ఆశా, అంగన్‌వాడీ, ఏఎన్ఎం, పంచాయితీ కార్యధర్శులు, ఫీల్డ్ అసిసెంట్లతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలను ఎంపీడీఓ రామకృష్ణ అందించారు. ఇండ్లలో నిలువనీరు ఉండకుండా తగు జాగ్రత్తలు ఇంటి యజమానులు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాలు గ్రామాలలో డ్రైడేలు పాటించాలన్నారు. వర్షాకాలం పూర్తి అయ్యేంత వరకు కాచి చల్లార్చిన నీటిని తాగ్ర విధంగా గ్రామాలలో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృపాకర్, మెడికల్ అధికారి సమీన, హెల్త్ సూపర్ వైజర్ ధనుంజయ్, నాగభూషణంలు పాల్గొన్నారు.

ఆటో ట్రాలీ బోల్తా.. తప్పిన ప్రమాదం


బోల్తా పడిన గ్యాస్ సిలిండర్ల ఆటో ట్రాలీ

హుజూరాబాద్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సిలిండర్ గ్యాస్ లోడ్‌తో వెళ్తున్న ఆటో ట్రాలీని ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టగా తృటిలో ప్రమాదం తప్పింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్యాస్ సిలిండర్‌లతో వెళ్తున్న ఆటో ట్రాలీని వరంగల్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులో మంగళవారం ఢీకొట్టింది. దీంతో ట్రాలీ నడిరోడ్డుపై బోల్తా కొట్టింది. అందులో ఉన్న గ్యాస్ సిలిండర్లు చెల్లాచెదురయ్యాయి. కొన్ని సిలిండర్లు లీక్ అయ్యాయి. ట్యాంకర్ డ్రైవర్ తప్పించుకొని పారిపోయే ప్రయత్నం చేయగా ట్యాంకర్ టైర్ కింద గ్యాస్ సిలిండర్ చిక్కుకు పోవడంతో లారీ ముందుకు కదలలేదు. ఆటో ట్రాలీలో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా, 108వాహనంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సిలిండర్లు చెల్లాచెదురు అయ్యాయి. ఆటోలో గ్యాస్ సిలిండర్లు ఉండటంతో ఏ జరుగుతుందోనని వాహనదారులు భయపడ్డారు. ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు ఊపీరి పీల్చుకున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నవీన్ (ఫైల్)

ఇల్లంతకుంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారంపేట గ్రామానికి చెందిన గొట్టం నవీన్ (26) అనే యువకుడు రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాలీఆటో నడుపుకుంటూ జీవించే నవీన్ సోమవారం మామిడి కాయలు తీసుకొని నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఇండ్లవాయి సమీపంలో అర్ధరాత్రి లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు.

ఇసుక లారీలను అడ్డుకున్న నాయకులు


ఇసుక లారీలను అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులు

మానకొండూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఇసుక లారీలను అడ్డుకున్నారు. మండలంలోని ఊటూర్ మానేరు వాగులోని ఇసుక రీచ్ నుంచి సరఫరా చేస్తున్న ఇసుక లారీలతో రోడ్డు చెడిపోవడమే కాకుండా దుమ్ము, ధూళి, శబ్ద కాలుష్యం, ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇసుక లారీలను నూతనంగా నిర్మించే బైపాస్ నుంచి తరలించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, పిట్టల మధు, బోడ రాజశేఖర్, ఎస్‌కే అబూద్ నాయకులు పాల్గొన్నారు.

పిడుగుపాటు.. ముందే పసిగట్టు



- దామిని యాప్ రూపొందించిన వాతావరణ శాఖ
- ఎరుపు, పసుపు, నీలి రంగుల ద్వారా పిడుగుపాటు సమాచారం

వెల్గటూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పిడుగు అనగానే ప్రతీ ఒక్కరు భయాందోళనకు గురి అవుతుంటారు. ఈ నేపథ్యంలో అనేక పరిశోధనలు చేసిన భారత వాతావరణ శాఖ పిడుగుపాటును ముందే పసిగట్టేలా ఓ యాప్‌ను ఆవిష్కరించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటరాలజీ (ఐఐటీఎం) ఆధ్వర్యంలో 'దామిని లైటింగ్ ఎలర్ట్' యాప్‌పై రూపొందించింది. పొలాల్లో పనులు చేస్తున్న సమయంలో, పశువుల కాపరులు పశువు లను మేపుతున్న సమయంలో అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడగానే సమీపంలో చెట్టు కిందికి వెళ్లి నిల్చుంటారు. ఎత్తైన చెట్టుకే పిడుగు వేస్తుందని తెలియక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పిడుగుపాటుతో పొంచి ఉన్న ప్రమాదాన్ని పసిగట్టే యాప్ ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చు.

● పిడుగుపాటును ఇలా గుర్తించవచ్చు..

మీరు ఉన్న ప్రదేశంలో పిడుగు ఎంత సమయంలో సంభవిస్తుందో హెచ్చరించేలా యాప్‌లో ఎరుపు, పసుపు, నీలం రంగుల్లో చూపిస్తుంది. దీని ద్వారా పిడుగు పాటు ప్రమాదాన్ని ముందే గుర్తించి ప్రాణాలు కాపాడుకోవచ్చు.

● ఎరుపు రంగు..

మీరు ఉన్న ప్రాంతంలో పిడుగుపడే అవకాశం ఉంటే 7 నిమిషాల ముందుగానే ఆ సర్కిల్ ఎరుపు రంగులోకి వస్తుంది.

● పసుపు రంగు..

మీరు ఉన్న ప్రాంతంలో 10 నుంచి 15 నిమిషాల లోపు పిడుగుపడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ పసుపు రంగుగా మారుతుంది.

● నీలం రంగు..

మీరు ఉన్న ప్రాంతంలో 18 నుంచి 25 నిమిషాల లోపు పిడుగు పడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ నీలం రంగులో కనిపిస్తుంది.

● యాప్ డౌన్ లోడ్ చేసుకునే విధానం

స్మార్ట్ ఫోన్ కలిగిన ప్రతీ ఒక్కరు ప్లే స్టోర్ నుంచి దామిని లైటింగ్ ఎలర్ట్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. ప్లే స్టోర్‌లో దామిని యాప్ అని టైప్ చేయాలి. యాప్ ఓపెన్ కాగానే పేరు, మొబైల్ నంబర్, అడ్రస్, పిన్‌కోడ్ రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం జీపీఎస్ లొకేషన్‌లో యాప్‌ను వినియోగించే సమయంలో మీ ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందో, లేదో మూడు రంగుల్లో సూచిస్తుంది.

● పాటించాల్సిన జాగ్రత్తలు

- మొబైల్ సిగ్నల్స్ పిడుగు పడే అవకాశాన్ని ఎక్కువ కల్పిస్తాయి. మబ్బులు ఉన్న సమయంలో పంట పొలాల్లో మొబైల్ ఫోన్ వినియోగించకపోవడం మంచిది.
- వర్షం పడే సమయంలో విద్యుత్ స్తంభాలు, సెల్‌ఫోన్ టవర్లు, బోరు పంప్ సెట్లకు దూరంగా ఉండాలి.
- పిడుగులు పొడవైన చెట్ల మీద పడే అవకాశం ఎక్కువగా ఉండడంతో వర్షం కురిసే సమయంలో వాటి కింద ఉండవద్దు.

అన్నదాతలకు ఉపయోగకరం
-సాయికిరణ్, ఏవో వెల్గటూర్



పిడుగుపాటును ముందే పసిగట్టే దామిని యాప్ ప్రజలకు ముఖ్యంగా అన్నదాతలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. రైతులు ఈ యాప్‌ను వినియోగించేలా అవగాహన పెంచుకోవడం మంచిది. పిడుగుపడే అవకాశం ముందే గుర్తించి ప్రాణాలు కాపాడుకోవచ్చు.

వివాహిత ఆత్మహత్యపై బంధువుల ఆందోళన

● భర్త, అత్తమామల అరెస్ట్ ● గ్రామంలో పోలీసుల బందోబస్తు


భర్త ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న బంధువులు

సిరిసిల్ల క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని ఎలిగేడు మండలం ముప్పిడితోటకు చెందిన పురెల్ల ప్రవల్లిక(28) ఆత్మహత్యకు ఆమె భర్త మద్దికుంట ప్రశాంత్ వేధింపులే కారణమంటూ మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరు గ్రామంలో పుట్టింటి వారు, బంధువులు ధర్నాకు దిగారు. పురెల్ల ప్రవల్లికకు రెండేళ్ల క్రితం పెద్దూరుకు చెందిన ప్రశాంత్‌తో వివాహమైంది. వివాహ సమయంలో రూ.12లక్షల వరకట్నం, ఇతర లాంఛనాలు ఇచ్చారు. అయినప్పటికీ భర్త వేధింపులు భరించలేక తల్లిగారింటి వద్దనే మే 10న గడ్డిమందు తాగి ప్రవల్లిక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు జూలపల్లి పోలీస్ స్టేషన్‌లో భర్త ప్రశాంత్‌తో పాటు ఆడపడుచులు, అత్త, మామలపై కేసు నమోదైంది. ఈ కేసులో నుంచి అత్త, మామ, ఆడపడుచులను తొలగించాలని వివాహ సమయంలో ఇచ్చిన వరకట్నం రూ.12లక్షలు, ఇతర లాంఛనాలకు సంబంధించిన ఖర్చుతో పాటు అన్ని కలిపి అదనంగా రూ.25 లక్షలు ఇవ్వాలని పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ జరిగింది. అయితే ప్రవల్లికు పెట్టిన బంగారం ఎక్కడ ఉందనే దానిపై క్లారిటీ లేకపోవడంతో ఘర్షణకు దారితీసింది. చివరికి బంగారం విషయం తేలడంతో పెద్దమనుషుల సమక్షంలో రాసిన రాజీ కాగితాన్ని చింపేసి భర్త తరఫున వెళ్లిన వారంతా ముప్పిడితోట నుంచి పెద్దూరుకు వచ్చేశారు. భార్య ప్రవల్లిక ఆత్మహత్య చేసుకొని 25రోజు లైనప్పటికీ పోలీసులు ఎవరినీ అరెస్ట్ చేయలేదని ముప్పిడితోట నుంచి వాహనాలలో దాదాపు 50నుంచి 70మంది వరకు మహిళలు తరలి వచ్చి పెద్దూరులోని భర్త ప్రశాంత్ ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. ఈ ధర్నాతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో టౌన్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ తమకు న్యాయం చేయాలని ఇంటి ఎదుట బైఠాయించిన ప్రవల్లిక బంధువులు, మహిళలు పట్టుబట్టారు. చివరికి పోలీసు లు జోక్యం చేసుకొని సముదాయించినప్పటికీ వెంటనే భర్త, అత్త, మామలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఇక్కడి పోలీసులు జూలపల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో అక్కడి నుంచి వచ్చిన పోలీసులు భర్త ప్రశాంత్, అత్తమామలను అరెస్ట్ చేసి జూలపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నాటుసారా బట్టీలపై పోలీసుల దాడి

ఓదెల, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలనూరులో సోమవారం రాత్రి పొత్కపల్లి ఎస్‌ఐ దీకొండ రమేష్ ఆధ్వర్యంలో నాటుసారా బట్టీలపై దాడి చేశారు. 500 లీటర్ల బెల్లం పానకం, ఐదు లీటర్ల నాటు సారా పట్టుకోగా తయారు చేస్తున్న బోదాసు పద్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను పాల్పడితే ఉపేక్షించేది లేదని, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించడం, నాటుసార తయారు చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సెల్ నంబర్ 8712656514కు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ కిషన్, కానిస్టేబుళ్ల రాజేందర్, రాములు పాల్గొన్నారు.

ఎల్ఎండీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మానేరు జలాశయంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. మంగళవారం జలాశయం మొదటి గేట్ వద్ద నీటిపై తేలియాడుతున్న వ్యక్తి మృతదేహాన్ని లేక్ పోలీసులు గుర్తించి కొత్తపల్లి పోలీసులకు సమాచారం అందించారు. చనిపోయిన వ్యక్తి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, బ్లూ జీన్‌పాయింట్, బ్లాక్ అండ్ వైట్ చెక్స్ ఫుల్‌షర్ట్ ధరించాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, గుర్తించినవారు కొత్తపల్లి పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గంగాధర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండలం ఆచంపల్లిలో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం కొత్తపల్లి మండలం ఎలగందుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 03: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,550 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు ఏడుగురు రైతులు 85క్వింటాళ్లు విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ట ధర రూ.7,550, కనిష్ఠ ధర రూ.7,400 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

గంజాయి పట్టివేత


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బావుపేటలో 1.2 కిలోల గంజాయి పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి ఆధ్వర్యంలో బావుపేటలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఒక చికెన్‌సెంటర్ వద్ద రాంపర్వేష్ సాయిని(40) అనే బీహార్‌కు చెందిన గ్రానైట్ కార్మికుడు అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా 1.2 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితుడు బీహార్ నుంచి గంజాయిని బావుపేటకు తీసుకు వచ్చి ఇక్కడి యువతకు 500 రూపాయలకు ఒక పాకెట్ చొప్పున విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితుడి అరెస్టు చేసినట్లు, గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సీఐతో పాటు ఎస్సై సాంబమూర్తి, సిబ్బందిని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, కరీంనగర్ రూరల్ ఏఎస్పీ శుభం ప్రకాశ్ అభినందించారు.

ఇంటికి నిప్పంటించిన దుండగులు


కాలిపోయిన వస్తువులు

వేములవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని మార్కండేయ నగర్‌లో ఎండ్రాల దేవయ్య ఇంటికి గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు పైఅంతస్తు, కింద భాగంలోనూ డీజిల్‌ను చల్లి నిప్పంటించినట్లు అనుమానిస్తున్నారు. ఇంట్లో అద్దెకు ఉన్న వ్యక్తి కాలుతున్న వాసన గమనించి బయటకు వచ్చి చూడగా అప్పటికే కాలుతున్న వస్తువులను చూసి ఇంటి యజమానికి సమాచారం అందించడంతో సకాలంలో మంటలను ఆర్పారు. ఈ సంఘటనపై వేములవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు దేవయ్య తెలిపారు.

ఏసీబీ వలలో రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్

● భూమి రిజిస్ట్రేషన్‌కు రైతు నుంచి రూ.15 వేలు లంచం డిమాండ్ ● రూ.10వేలు తీసుకుంటుండగా పట్టివేత


ఏసీబీకి పట్టుబడిన రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్ గణేష్, డాక్యుమెంట్ రైటర్ ఎండీ ముజాఫర్

రాయికల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతు నుంచి డాక్యుమెంట్ రైటర్ ద్వారా రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా రాయికల్ మండల ఇన్‌చార్జి తహసీల్దార్ గణేష్‌ను మంగళవారం కరీంనగర్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాయికల్ మండలం సింగర్రావుపేట గ్రామ శివారులోని 42.5 గుంటల వ్యవసాయ భూమిని రవి అనే రైతు ఇతరులకు విక్రయించాడు. అనంతరం భూమిని కొన్నవారికి రిజిస్ట్రేషన్ చేసేందుకు డాక్యుమెంట్ రైటర్ ఎండీ ముజాఫర్‌ను మూడు రోజుల క్రితం కలిశాడు. రైతు విక్రయించిన భూమిలో 16 గుంటలు కెనాల్ భాగానికి వెళ్తుందని చెప్పి ఇన్‌చార్జి తహసీల్దార్ రూ.15 వేలు లంచం డిమాండ్ చేశాడు. ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ ద్వారా రూ.10 వేలు ఇచ్చేందుకు అంగీకరించిన రైతు రవి ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఏసీబీ అధికారులు సూచన మేరకు మంగళవారం డాక్యుమెంట్ రైటర్‌కు బాధితుడు రవి రూ.10 వేలు ఇచ్చాడు. అనంతరం డాక్యుమెంట్ రైటర్ ఎండీ ముజాఫర్ నుంచి రూ.10 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్, డాక్యుమెంట్ రైటర్‌పై కేసు నమోదు చేసి కోర్టుకు పంపినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు లేదా వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా ఫిర్యాదు చేయాలని డీఎస్పీ సూచించారు.

తండ్రిని కారుతో ఢీకొట్టి హత్య చేసిన కుమారుడి అరెస్టు


నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య

చందుర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి తల్లిని వేధిస్తున్నాడని కక్ష గట్టి తండ్రిని హత్య చేసిన సంఘటనలో నిందితుడిని మంగళవారం చందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సీఐ వెంకటేశ్వర్లు హత్య కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సీఐ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలం దేవునితండాకు చెందిన జాటోత్ తిరుపతి తన భార్యతో తరుచూ గొడవ పడుతుండేవాడని, గొడవల కారణంగా తిరుపతి కొడుకు జటోత్ రాజేష్ తన తండ్రిపై పలుమార్లు దాడి చేశాడు. దాడి సంఘటనలపై రాజేష్‌పై చందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదు అయినాయని, ఆ కేసులు కోర్టులో ట్రయల్‌లో ఉన్నాయన్నారు. ఈ నెల 2 మధ్యాహ్నం సమయంలో తిరుపతి మళ్లీ తన భార్యతో గొడవపడుతున్నాడని సమాచారం అందడంతో, ఆవేశంతో రాజేష్ తన కారులో తన ఇంటికి వస్తుండగా, తండ్రి తిరుపతి రోడ్డుపై నిల్చోని ఉండగా, తరచూ ఇలాగే గొడవలు చేస్తున్నాడని కక్ష గట్టి తన కారుతో తన తండ్రిని బలంగా ఢీకొట్టి తిరుపతిపైకి పలుమార్లు కారును ఎక్కించగా స్పృహ తప్పి రక్తం మడుగులో పడిపోయాడు. స్థానికులు అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు పేర్కొన్నారు.

తండ్రిని కక్ష పూరితంగా హత్య చేసిన రాజేష్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కారును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసును త్వరగా విచారించి నేరస్తుడైన రాజేష్‌కు కోర్టు ద్వారా శిక్ష పడేలా కృషి చేస్తానని చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

యువతకు అండగా మై భారత్



పేరు నమోదు చేసుకుంటే పలు ప్రయోజనాలు

గణేశ్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ యువత కోసం మై భారత్ పోర్టల్ అందుబాటులోకి తెచ్చింది. 15 నుంచి 29 ఏళ్లలోపు యువతీ, యువకులు ఇందులో పేర్లు నమోదు చేసుకుంటున్నారు. నిరుద్యోగ యువత సాధికారత సాధించడంతో పాటు వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఈ పోర్టల్ ఉపయోగపడుతుంది. ఇందులో దేశవ్యాప్తంగా విద్య, ఉద్యోగావకాశాలు, పలు రకాల కోర్సులు, తదితర అంశాలపై ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తున్నారు. www.mybharath.gov.in వెబ్‌సైట్లో నమోదుకు అవకాశం కల్పించారు. ఈ వెబ్‌సైట్‌లోకి వెళ్లి రిజిస్టర్ నౌ ఆప్షన్‌ను క్లిక్ చేస్తే వివరాలు అడుగుతుంది. ఆ వివరాలన్నీ నమోదు చేస్తే రిజిస్టర్ అవుతుంది. తర్వాత వివిధ కార్యక్రమాల అప్‌డేట్స్ రిజిస్టర్ చేసుకున్న వారికి మెసేజ్, ఈ మెయిల్ రూపంలో వస్తాయి. పోర్టల్ లో పేర్లు నమోదు చేసుకున్న యువతను నాలుగు ప్రధాన అంశాలతో అనుసంధానం చేస్తున్నారు.

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు అవసరమైన అర్హతలపై అవగాహన కల్పించడం.
- ఎంచుకున్న రంగంలో నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు అవకాశాలు, వసతులను వివరించడం.
- సామాజిక బాధ్యత పెంపొందించేందుకు యువత ఉజ్వల భవిష్యత్తు లక్ష్యంగా వివిధ సంస్థల భాగస్వామ్యంతో కార్యక్రమాలు చేపట్టడం.
- వ్యాపారాల్లో యువత రాణించేలా ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ)లో రాయితీ ఎలా పొందాలన్న సమాచారం పోర్టల్లో వ్యాపార, అందుబాటులో ఉంటుంది. పారిశ్రామికవేత్తలతోనూ మాట్లాడే అవకాశం కల్పించి సందేహాలు నివృత్తి చేస్తారు.

● ఉపాధికి బాటలు..

డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువతలో నైపుణ్యం ఉన్నా వారికి సరైన ప్రోత్సాహం అందడం లేదు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలున్నా అందుకోలేకపోతున్నారు. ఆర్థిక స్థోమత లేక పరిశ్రమల స్థాపనలో ఇబ్బందులు పడుతున్నారు. వీటిని అధిగమించేందుకు మై భారత్ పోర్టల్ వేదిక కానుంది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఇతర ఉన్నత విద్య చదువుతున్న వారి ప్రతిభ ఆధారంగా ఉపాధి పొందేందుకు మార్గ నిర్దేశం చేయనున్నారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి
- వెంకట రాంబాబు, ఎన్‌వైకే జిల్లా యువజన అధికారి



మై భారత్ పోర్టల్ ప్రయోజనాలపై విద్యా సంస్థల్లో ప్రచారం చేస్తున్నాం. జిల్లాలోని యువతీ, యువకులు తమ పేర్లు పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

తాగుడుకు బానిసై యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసగా మారిన యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్ త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామానికి చెందిన బాస కరుణాకర్(31) తల్లిదండ్రులతో కలిసి కరీంనగర్ మారుతీనగర్‌లో ఓ ఇంటిలో అద్దెకుంటున్నాడు. తండ్రితోపాటు గ్రానైట్ ఫ్యాక్టరీలో కూలీగా పని చేసేవాడు. ప్రతి రోజు మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ పడేవాడు. గత నెల 30న తండ్రి, సోదరి బంధువుల వివాహానికి హైదరాబాద్ వెళ్లారు. తల్లితోపాటు కరుణాకర్ ఇంటి వద్ద ఉన్నాడు. సోమవారం రాత్రి 8 గంటలకు కరుణాకర్ మద్యం తాగి వచ్చి భోజనం చేసి పడుకున్నాడు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ఇంటి ముందు రోడ్డుపై కాలిన గాయాలతో యువకుడు మృతి చెంది ఉండడాన్ని గమనించి స్థానికులు గుమిగూడారు. అక్కడికి వెళ్లిన తల్లి యువకుడిని తన కొడుకు కరుణాకర్‌గా గుర్తించింది. ఆత్మహత్యకు ముందు 'నేను చాలా దూరం వెళుతున్నాను.. చాలా తప్పు చేశాను. కాళ్లు మొక్కడం, దండంపెట్టడం తప్ప చేసేది ఏమీ లేదు. అమ్మ, నాన్నలను జాగ్రత్తగా చూసుకోవాలి' అని కరుణాకర్ తెల్లవారు జామున 3:54 గంటలకు తన సోదరికి వాట్సప్‌లో వాయిస్ మెసేజ్ పంపించాడు. తాగుడుకు బానిసగా మారి నిత్యం కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్న కరుణాకర్ తప్పుచేశానని గ్రహించి క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి మధు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి రైతు మృతి

ఎల్లారెడ్డిపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్‌లో రైతు కరికె నాంపల్లి(65) ప్రమాదవశాత్తు తన వ్యవసాయ బావిలో పడి మంగళవారం మృతి చెందాడని పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. వారి కథనం మేరకు... గ్రామంలోని నాంపల్లి తనకున్న రెండెకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ జీవిస్తుండేవాడు. యాసంగి వరి పంట కోత అనంతరం వానాకాలం పంట సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్నాడు. వ్యవసాయ బావి చుట్టూ ఉన్న ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. చీకటి పడినా భర్త నాంపల్లి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య శంకరవ్వ వ్యవసాయ పొలం వద్దకు చేరుకుంది. చుట్టుపక్కల గాలించడంతో వ్యవసాయ బావి గట్టు వద్ద చెప్పులు కనిపించాయి. కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు అక్కడకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో నాంపల్లి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య శంకరవ్వ, వివాహమైన కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

రాజన్న కోడెల సంరక్షణకు పకడ్బందీ చర్యలు

● కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా



తిప్పాపూర్ గోశాలలో ఉన్న రాజన్న కోడెలు

వేములవాడ కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలలో అకాల వర్షాలు, అనారోగ్య కారణాలు, పరిమితికి మించి కోడెలు ఉండటంతో కోడెల సంరక్షణపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మంగళవారం గోశాలను సందర్శించి దగ్గరుండి పలు పనులను చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాలలో పక్కా ప్రణాళికతో పనులు చేయిస్తున్నామన్నారు. గోశాల ఆవరణలో గుంతలు పడిన చోట, బురద, మిగతా స్థలాల్లో మొరం పోయించి చదును చేయించామన్నారు. కోడెలకు మెరుగైన దాణా, పచ్చి గడ్డి అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసి, త్వరగా అందేలా ఏర్పాట్లు చేశామని, ఐదు వెటర్నరీ వైద్యుల బృందం గోశాలలో ఉండి సేవలు అందిస్తున్నారన్నారు. పచ్చి గడ్డి సరఫరా కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపి రోజు సరఫరా చేసే ఒక ట్రాక్టర్ గడ్డికి బదులుగా రోజు 10 టన్నుల (5ట్రాక్టర్‌ల) పచ్చి గడ్డిని అందించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

అనారోగ్యంతో మరో ఆరు కోడెల మృతి

● మరో నాలుగు కోడెల అస్వస్థత ● ఇప్పటికీ 26 మృతి

సిరిసిల్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం తిప్పాపూర్ గోశాలలో అనారోగ్యానికి గురైన మరో ఆరు కోడెలు మంగళవారం మృతిచెందాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. రాజన్న కోడెల హెల్త్ బులిటెన్‌ను ఆయన విడుదల చేశారు. అకాల వర్షాలు, అనారోగ్య పరిస్థితుల వల్ల తిప్పాపూర్ గోశాలలో మొదటి రోజు 8 కోడెలు, రెండో రోజు 5 కోడెలు, మూడో రోజు 4 కోడెలు, నాలుగో రోజు 3 కోడెలు, మంగళవారం 6 కోడెలు మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు గోశాలలో 26 కోడెలు మృతిచెందినట్లు తెలిపారు. ప్రస్తుతం గోశాలలో 1300 పశువుల్లో 14 పశువులు అనారోగ్యంతో బాధపడుతుండగా, కొత్తగా మరో 4 అనారోగ్యం బారిన పడ్డాయని, డాక్టర్లు వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. చిన్న వయస్సు గల పశువులు, పెద్ద వయస్సుల గల పశువులు ఒకేచోట ఉండడం వల్ల మరణాలు సంభవిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు సమర్పించే కోడెలు తప్పనిసరిగా సంవత్సరంన్నర కంటే ఎక్కువ వయస్సు ఉండాలని సూచించారు.

రేషన్ పంపిణీలో మారిన నిబంధనలు

● కేంద్రం, రాష్ట్రానికి వేర్వేరుగా వేలిముద్రలు
● బియ్యం పంపిణీలో జాప్యం
● లబ్ధిదారులకు ఇబ్బందులు



చొప్పదండి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలోని రాంనగర్ కు చెందిన అనిత శ్రీరామ టాకీస్ సమీపంలోని రేషన్ షాప్‌నకు ఆదివారం వచ్చింది. మూడు నెలల బియ్యం ఒకేసారి వస్తాయని ఆమె సంతోషంతో ఉంది. అప్పటికే అక్కడ 50 మంది వరకు లబ్ధిదారులు ఉండడంతో రేషన్ కార్డులను వరుస క్రమంలో పెట్టాడు డీలర్. రెండు గంటల వరకు తన నంబర్ వస్తుందని అనిత ఎదురు చూ సింది. ఆదివారం ఆమె నంబర్ రాలేదు. సోమవారం గడిచింది. మంగళవారం సాయంత్రం వరకూ ఆమె వంతు రాలేదు. దీంతో నిరాశగా ఆమె వెనుదిరిగింది. ఇందుకు కారణం మారిన నిబంధనలు. చొప్పదండి మండలంలోని అన్ని రేషన్ దుకాణాల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది.

● బయోమెట్రిక్‌లో ఆలస్యం

రేషన్ బియ్యం పంపిణీ లో ఈ పాస్ విధానంలో ప్రతి లబ్ధిదారుడు తప్పనిసరిగా బయో మెట్రిక్ వేలి ముద్ర వేయాల్సి ఉంటుంది. ఈ నెల నుంచి కొత్త నిబంధనలు అమలు చేయాలని అధికారులు ఆదే శించారు. ప్రతి లబ్ధిదారుడు రెండు సార్లు వేలి ముద్రలు వేయాల్సి ఉంటుంది. ఒక సారి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 5 కిలోల బియ్యానికి, మరో సారి రాష్ట్రం ఇచ్చే కిలో బియ్యానికి వేలి ముద్రలు వేయాలి. ఇదే సమయంలో డీలర్ రెండు సార్లు తూకం వేసి లబ్ధిదారుడి ఫోన్ నంబర్ నమోదు చేయాలి. డీలర్ల వద్ద మొబైల్ సిగ్నల్ సరిగ్గా అందక సర్వర్ సమస్య ఏర్పడుతోంది. దీంతో బియ్యం పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇక పై ప్రతి నెల ఇదే విధంగా బయో మెట్రిక్‌లో లబ్ధిదారులు వేలుముద్రలు వేయాల్సి ఉంటుంది. ఈ సారి మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం ఒకే సారి లబ్ధిదారులకు అందజేస్తున్నారు.



● మూడు నెలల బియ్యం పంపిణీతో ముప్పుతిప్పలు

ఒక నెలకు సంబంధించి లబ్ధిదారుడు రెండు సార్లు వేలిముద్రలు వేయగా డీలర్ రెండు సార్లు తూకం వేస్తున్నాడు. మూడు నెలల బియ్యం కోసం ఆరు సార్లు వేలిముద్రలు, ఆరు సార్లు తూకం వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్కో లబ్ధిదారుడుకి బియ్యం పంపిణీ కోసం 15 నుంచి 20 నిముషాల సమయం పడుతుంది. ప్రతి రోజు 20 మందికి మించి బియ్యం పంపిణీ జరుగడం లేదని డీలర్లు, లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒకే రోజు వందలాది మందికి బియ్యం పంపిణీ చేసిన డీలర్లు మారిన నిబంధనలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతు న్నారు. మండలంలోని ప్రతి రేషన్ షాప్ ముందు ప్రజలు బారులు తీరి ఉండి రోజుల తరబడి బియ్యం కోసం పడిగాపులు కాయల్సిన పరిస్థితులు ఏర్పాడ్డాయి.

రోజు రేషన్ షాప్ వద్ద ఉండాల్సి వస్తుంది

- వనిత, చొప్పదండి



మూడు నెలల బియ్యం ఒకే సారి వస్తున్నాయని ఎంతో సంతోష పడ్డాను. మూడు రోజులుగా షాప్ వద్దనే ఉంటున్నాను. బియ్యం పంపిణీలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇంతకు ముందు ఎప్పుడైన ఒకే రోజులో బియ్యం తీసుకుపోయే వాళ్లం. ఇప్పుడు నిబంధనలు మారాయని అంటున్నారు. తొందరగా బియ్యం అందేలా అధికారులు చూడాలి.

కొత్త నిబంధనలతో ఇబ్బందులు..

- కొక్కుల రాంమోహన్, డీలర్, చొప్పదండి



రేషన్ బియ్యం పంపిణీ లో కొత్త నిబంధనలు అమలు చేయడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కో లబ్ధిదారుడికి ఇరవై నిముషాల సమయం పడుతుంది. షాప్ ఎదుట లబ్ధిదారులు బారులు తీరి ఉంటున్నారు. ఆరు సార్లు తూకం వేసి వేలిముద్రలు నమోదు చేయడంతో బియ్యం పంపిణీలో చాలా జాప్యం జరుగుతుంది.

హోరాహోరీగా ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలు

- కరీంనగర్ టౌన్, కరీంనగర్ రూరల్, వేములవాడ జట్ల విజయం
- కరీంనగర్ టౌన్ క్రీడాకారుడు రిత్విక్ సూర్య డబుల్ సెంచరీ



రిత్విక్ సూర్య

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా అండర్-25 లీగ్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మంగళవారం ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లలో కరీంనగర్ టౌన్, కరీంనగర్ రూరల్, వేములవాడ జట్లు గెలుపొందాయి. జిల్లా కేంద్రంలోని సెయింట్ అల్ఫోన్స్ మైదానంలో కరీంనగర్ రూరల్, పెద్దపల్లి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కరీంనగర్ రూరల్ జట్టు 5 వికెట్ల తేడాతో పెద్దపల్లి జట్టుపై విజయం సాధించింది. శాతవాహన యూనివర్సిటీ మైదానంలో కరీంనగర్ టౌన్, హుజూరాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కరీంనగర్ టౌన్ జట్టు 224 పరుగుల భారీ ఆధిక్యంతో గెలుపొందింది. వేములవాడలో వేములవాడ, జగిత్యాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వేములవాడ జట్టు నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్‌లను కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు ఆగమరావు, మురళీధర్‌రావు, మహేందర్ గౌడ్, మనోహర్‌రావు, నితిన్ పర్యవేక్షించారు.

● ఆకట్టుకున్న రిత్విక్ సూర్య

కరీంనగర్ టౌన్ జట్టుకు చెందిన రిత్విక్ సూర్య హుజూరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 30 ఫోర్లు, 10 సిక్స్‌లతో 220 పరుగులు చేసి అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ జట్టుకే చెందిన మన్నిత్‌రెడ్డి హ్యాట్రిక్ సాధించాడు.

బద్ది పోచమ్మకు బోనం మొక్కులు



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన శ్రీబద్ది పోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించి ఆలయంలోకి ప్రవేశించారు. ముందుగా అమ్మవారికి పట్నాలు వేసి నూతన వస్త్రాలతో ఒడిబియ్యాన్ని సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పాడిపంట, పిల్లాపాపలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు.

ఖని బస్టాండ్ నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు

కళ్యాణ్‌నగర్ జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ నుంచి ఈ నెల 9న తమిళనాడులోని అరుణాచలంకు ప్రత్యేక బస్సు నడిపిస్తున్నట్టు గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం నాగభూషణం తెలిపారు. ఈ నెల 9న మధ్యాహ్నం 3 గంటలకు గోదావరిఖని బస్టాండ్ నుంచి బయలుదేరి పెద్దపల్లి, కరీంనగర్ మీదుగా కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, మహాలక్ష్మి టెంపుల్, వేలూరు పుణ్యక్షేత్రాల గుండా 10న రాత్రి 10గంటలకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. అరుణచల గిరి ప్రదక్షిణ అనంతరం 11న సాయంత్రం 3 గంటలకు తిరుగు ప్రయాణంలో జోగులాంబ మీదుగా 12న సాయంత్రం 6 గంటలకు గోదావరిఖనికి చేరుకుంటుందన్నారు. గోదావరిఖని నుంచి అరుణాచలంకు పెద్దలకు రూ.4,850, పిల్లలకు రూ.4100, కరీంనగర్ నుంచి పెద్దలకు రూ.4,500, పిల్లలకు రూ.3,800 ధర నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 7013504982, 7989847927 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయం వద్ద భక్తులు

మల్యాల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. విద్యాసంస్థలు త్వరలోనే పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో వేలాదిగా తరలివచ్చిన వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. గంటల తరబడి క్యూలైన్‌లలో వేచి ఉండి అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. క్యూలైన్‌ల వద్ద నీటి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గంలో వాహనాలు బారులు తీరగా జైజంక్షన్, పార్కింగ్ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి భక్తులు ఇబ్బంది పడ్డారు.

రెండిళ్లలో చోరీ

గంగాధర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో రెండు ఇళ్లలో చోరీ జరిగినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డం వీరారెడ్డి గత నెల 31న కరీంనగర్‌లో బంధువుల వివాహం ఉండగా ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. మంగళవారం వీరారెడ్డి పక్కింటి వారు ఫోన్‌చేసి మీ ఇంటి తాళం పగులగొట్టి ఉంది, తలుపులు తీసి ఉన్నాయని తెలిపారు. వీరారెడ్డి మంగళవారం వచ్చి చూడగా తాళం పగుల గొట్టి, ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో బీరువాలో దాచిన 2లక్షలు చోరీకి గురయ్యాయి. వీరారెడ్డి ఇంటికి కొద్ది దూరంలోని కనకట్ల ఎల్లవ్వ ఇంట్లో నాలుగు వేల విలువైన రెండు ఇత్తడి బిందెలు, రెండు బియ్యం బస్తాలు ఎత్తుకెళ్లారు. ఏఎస్సీ శుభం ప్రకాశ్ ఆధ్వర్యంలో బాధిత ఇళ్లను పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరించారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో..

● ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ● ఏడాది ప్రోగ్రెస్ రిపోర్టు విడుదల

కరీంనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర మంత్రిగా బిజీగా ఉన్నా నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కరీంనగర్ ఎంపీగా ఏడాది కాలం పూర్తవడంతో ఆయన తన ప్రోగ్రెస్ రిపోర్టును మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్ ఎంపీగా రెండో సారి ఎన్నికై ఏడాది కాలం పూర్తవుతుందన్నారు. రెండో సారి ఎన్నికైన తనకు ప్రధాని మోదీ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా అవకాశం కల్పించారన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయలు మంజూరు చేయించామని తెలిపారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న కరీంనగర్-జగిత్యాల రహదారి విస్తరణకు రెండు వారాల్లో టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు.

● ఉపాధి హామీ కింద ప్రతి మండలానికి రూ. 2 కోట్లు

జాతీయ ఉపాధి హామి పథకం కింద ప్రతి మండలానికి రెండు కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఆయా మండలాల్లో రోడ్లను నిర్మించామన్నారు. సగటున ఒక్కో గ్రామానికి ఐదు లక్షల రూపాయలు అంతర్గత రోడ్లకు ఖర్చు చేశామని ప్రకటించారు. కరీంనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం 33 కోట్లకు పైగా ఖర్చు చేసి సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. కరీంనగర్, జమ్మికుంట ఆర్వోబీల నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని సంబంధిత అధికారులతో సమీక్షించి వేగవంతంగా పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆగస్టు నాటికి జమ్మికుంట ఆర్వోబీ నిర్మాణం పూర్తి కాకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించామని తెలిపారు. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణంలో ఇబ్బందులను అధిగమించేందుకు రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయించామన్నారు.

● త్వరలో వారానికి నాలుగు సార్లు తిరుపతి రైలు

కరీంనగర్-తిరుపతి రైలును వారానికి నాలుగుసార్లు నడిచేలా త్వరలో సానుకూల నిర్ణయం రాబోతుందన్నారు. సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో సైనిక్ స్కూల్స్ ఏర్పాటు కోసం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు వినతి పత్రం అందించామన్నారు. తన వినతిపత్రానికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. సిరిసిల్ల, హుస్నాబాద్ ప్రాంతాల్లో రెండు నవోదయ స్కూళ్లు ఏర్పాటు కాబోతున్నాయన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో టెక్నికల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని, దీనిపై కేంద్రం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ప్రసిద్ధ ఆలయాలను టూరిజం సర్క్యూట్‌గా మార్చాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అందులో భాగంగా సాక్సి (ఎస్ఏసీఎస్ఐ) పథకం కింద అధ్యాత్మిక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసిందని చెప్పారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో లా కళాశాల ఏర్పాటు కోసం వీసీ, మాజీ మేయర్ సునీల్‌రావులతో కలిసి కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్‌ను కలిసి మంజూరు చేయించామన్నారు. ఈ ఏడాది నుంచి లా కాలేజీలో అడ్మిషన్లు కూడా ప్రారంభం కాబోతున్నాయన్నారు. అంబేద్కర్ స్టేడియంలో సింథటిక్ పార్క్, స్పోర్ట్స్ రిక్రియేషన్ సౌకర్యాలు కల్పించాలని చేసిన ప్రతిపాదనకు కేంద్ర క్రీడా శాఖ సుముఖత వ్యక్తం చేసిందన్నారు. కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటవుతుందన్నారు.



ఎంపీగా గెలిచిన తర్వాత ర్యాలీలో బండి సంజయ్‌కుమార్ (ఫైల్)

● డంప్‌యార్డ్ సమస్యకు త్వరలో పరిష్కారం

కరీంనగర్ ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న డంప్‌యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం హామీ ఇవ్వడంతో పాటు, నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఏడాదికాలంగా ఐదు కోట్ల రూపాయలతో వేములవాడ, హుస్నాబాద్, హుజూరాబాద్, జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రులకు అత్యాధునిక వైద్య పరికరాలను అందించామన్నారు. పదో తరగతి వరకు చదివే ఆరు వేల మంది బాలికలకు ప్రత్యేకంగా సైకిళ్లు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కేంద్ర మంత్రిగా బిజీగా ఉన్నప్పటికి ఓట్లేసి భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేందుకు ప్రయత్నిస్తున్నానన్నారు.

ఎంకామ్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ ఉచిత కోచింగ్

గణేశ్‌నగర్,జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఎంకామ్ ప్రవేశ పరీక్షకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభించినట్లు వక్తలు తెలిపారు. ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కరీంనగర్, కాకతీయ గవర్నమెంట్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) హనుమకొండ ఆధ్వర్యంలో తెలంగాణ కామర్స్ అసోసియేషన్ సౌజన్యంతో ఎంకామ్ ప్రవేశ పరీక్ష 2025 కోసం మంగళవారం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ ప్రభుత్వ కళాశాలలు, అధ్యాపకులు ఉత్తమ సేవలు అందించడానికి ముందుంటారన్నారు. సీనియర్ ప్రొఫెసర్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఉస్మానియా యూనివర్సిటీ, తెలంగాణ కామర్స్‌అసోసియేషన్ ప్రెసిడెంట్ చెన్నప్ప, జీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్ రెడ్డి, ప్రొఫెసర్ కె. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఐదు రోజుల జైలు శిక్ష

కోల్‌సిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడుపుతూ రెండోసారి పట్టుబడిన శనిగరపు సుమన్ అనే వ్యక్తికి మంగళవారం గోదావరిఖని రెండవ అదనపు న్యాయస్థానం న్యాయమూర్తి వెంకటేష్ ఐదు రోజుల జైలు శిక్ష విధించారు. దీంతో అతన్ని కరీంనగర్ జైలుకు తరలించినట్టు ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. మరో నలుగురికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్టు పేర్కొన్నారు.

క్రీడా పాఠశాల పిలుస్తోంది..

● హాకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో స్పోర్ట్స్ స్కూల్స్
● నాలుగో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్
● రాష్ట్రవ్యాప్తంగా 60 మంది బాలురు, 60 మంది బాలికలకు అవకాశం
● జూలై 8 నుంచి హాకీంపేటలో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు



కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులుగా ఎదగాలనుకునేవారికి విద్యార్థులలకు మంచి అవకాశం క్రీడా పాఠశాలలు. రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాల్లో 21025-26 విద్యాసంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్రంలో హాకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో స్పోర్ట్స్ స్కూల్స్ ఉన్నాయి. ఈ సంవత్సరానికి నాలుగు తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభచాటి ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు ఈ పాఠశాలల్లో ప్రవేశం పొందుతారు. రాష్ట్రంలోని మూడు పాఠశాలల్లో 60 మంది బాలురు, 60 మంది బాలికలు నాలుగో తరగతిలో చేరేందుకు అవకాశం ఉంది. మండల జిల్లా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించి 20 మంది బాలురను, 20 మంది బాలికలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు.

● ప్రవేశాల షెడ్యూల్...

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు మండల స్థాయిలో ఎంపిక పోటీలను ఆయా మండల కేంద్రాల్లో ఈ నెల 16 నుంచి 25 వరకు నిర్వహిస్తారు. మండలస్థాయిలో ఎంపికైన క్రీడాకారు లకు జిల్లాస్థాయిలో ఎంపిక పోటీలను జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 27 నుంచి 30 వరకు నిర్వహిస్తారు. జిల్లాస్థాయిలో ఎంపిక చేసిన 20 మం ది బాలురను, 20 మంది బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు. రాష్ట్రస్థాయి పోటీలు హాకీంపేటలోని క్రీడా పాఠశాలలో జూలై 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

● విద్యార్థులకు నిర్వహించే శారీరక పరీక్షలు...

మండలస్థాయిలో మొదట విద్యార్థుల అర్హత పత్రాలను పరిశీలించి బరువు, ఎత్తు, ఫ్లెక్సిబిలిటీ అంశాల్లో పరీక్షలను నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలోనూ ఇవే పరీక్షలను నిర్వహిస్తారు. వీటితోపాటు విద్యార్థులకు అన్ని దశల్లో 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగు, 610 షటిల్ రన్, మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ నిర్వహిస్తారు. ఒక్కో అంశానికి మూడు మార్కుల చొప్పున ఏడు అంశాలకు 21 మార్కులు ఉంటాయి. విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహిస్తారు. వయస్సు ధ్రువీకరణ పరీక్షతోపాటు శారీరక పటుత్వం, బొక్కల పటిష్ఠత అంశాలను పరీక్షిస్తారు.

- మొత్తం పరీక్షల్లో 15 మార్కులకుపైగా వచ్చిన విద్యార్థులందరు అర్హులుగా భావిస్తారు.
- విద్యార్థుల వయస్సు 8 నుంచి 9 సంవత్సరాలు ఉన్నవారు అర్హులు.

● క్రీడా విభాగాల్లో శిక్షణ...

అథ్లెటిక్స్, ఆర్చరీ, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, రోయింగ్, వాలీబాల్, జూడో, ఫెన్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, రెజ్లింగ్ క్రీడాంశాలతోపాటు ఖోఖో, కబడ్డీ అంశాల్లో ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ అందిస్తారు. క్రీడా పాఠశాలలో ఉత్తమమైన క్రీడాకారులుగా ఎదిగిన వారికి రైల్వే, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, పోలీస్, బ్యాంక్స్, పోస్టల్ శాఖ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా కోచ్‌లు, కార్పొరేట్ సెక్టార్లలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుంది.

● కావలసిన పత్రాలు...


విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులతోపాటు మున్సిపాలిటీ, పంచాయతీ నుంచి వయస్సు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. ఆధార్ కార్డు, కమ్యూనిటీ సర్టిఫికెట్, మూడో తరగతి పాస్ సర్టిఫికెట్, మూడో తరగతి ప్రగతి పత్రంతో జిల్లా, రాష్ట్ర ఎంపికలకు హాజరు కావాలి.

● సదుపాయాలు

క్రీడా పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రభుత్వం అనేక సదుపాయాలను కల్పిస్తుంది. ఉచిత విద్య, భోజన, వసతి సౌకర్యాలు, ప్రతి సంవత్సరం రెండు ట్రాక్ సూట్లతోపాటు, క్రీడా దుస్తులను, స్పోర్ట్స్ షూస్‌ను ప్రభుత్వం అందిస్తుంది. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందిస్తారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రంశిక్షణ ఉంటు ంది. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యే విద్యార్థులకు ప్రయాణ భత్యాలు అందిస్తారు.

విద్యార్థులకు సువర్ణావకాశం...

- వి శ్రీనివాస్ గౌడ్, డీవైఎస్‌వో, కరీంనగర్



క్రీడాకారులుగా ఎదగాలనుకునే వారికి ఇది సువర్ణావకాశం. క్రీడా పాఠశాలల్లో విద్యను అభ్యసించిన అనేకమంది అంతర్జాతీయ స్థాయితోపాటు ఒలింపిక్స్‌లాంటి మెగా ఇవెంట్లలో పాల్గొని సత్తాచాటారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన శిక్షణను క్రీడా పాఠశాలల్లో అందిస్తారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

గ్రామ పంచాయతీ రసీదు బుక్ మాయం

-ఎంపీవోకు ఫిర్యాదు

కొడిమ్యాల, జూన్3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని రసీదు బుక్ మాయమైందని కార్యదర్శి కె. జ్యోతి ఇటీవల ఎంపీవో వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసినట్లు ఆలస్యంగా తెలిసింది. గ్రామానికి చెందిన అలీం అనె యువకుని తల్లి మృతిచెందగా మృతురాలి పేరున ఉన్న ఇంటిని తన పేరున మార్పిడి చేసుకోవటానికి దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో గ్రామ పంచాయతీ కారోబారు యువకుని వద్ద నుండి 6వేల రూపాయల ఫోన్ పే కొట్టించుకొని 3వేల రూపాయలకు రసీదు వాట్సాఫ్ ద్వారా పంపాడన్నారు. యువకునికి అందిన రసీదు ఆధారంగా కార్యదర్శి కార్యాలయంలో రసీదు బుక్‌లను పరిశీలించింది. పంచాయతీ కార్యాలయంలో పనిచేసె కారోబారు రసీదు ఇచ్చిన బుక్ కార్యాలయంలో లేకపోవటంతో బుక్ మాయమైందన్న సంగతి బయట పడింది. రసీదు బుక్ లేని విషయమై కార్యదర్శి కె. జ్యోతిని వివరణ కోరగా ఎంపీవోకు ఫిర్యాదు చేశామన్నారు. ఎంపీవో వెంకటే శ్వర్లును వివరణ కోరగా ఫిర్యాదు అందింది నిజమేనన్నారు. విచారణ చేస్తున్నామని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

కొడిమ్యాల, జూన్3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ గ్రామ పంచాయతీ వద్ద మున్నూరు కాపు కులస్తులకు మంగళవారం కరీంనగర్ పట్టణంలోని మెడికవర్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 120మందికి బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

-అదనపు కలెక్టర్ లత -జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు ప్రారంభం

కోరుట్ల రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదసులను నిర్వహిస్తోందని అదనపు కలెక్టర్ లత అన్నారు. మంగళవారం మండలంలోని నాగులపేట గ్రామంలో తహసీల్దార్ కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును సందర్శించారు. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని సంగెం గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ ఫారూక్ ఆధర్యంలో దరఖాస్తులు స్వీకిరించారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లత

●**జగిత్యాలరూరల్:** జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లో మంగళవారం నిర్వహించిన భూభారతికి దరఖాస్తులు వెల్లువగా వచ్చాయి. జగిత్యాల అర్బన్ మండలంలోని మోతె గ్రామంలో 28, తిప్పన్నపేట గ్రామంలో 20 వివిధ భూసమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లు జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రాంమోహన్ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్‌లో 104 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రాంమోహన్ తెలిపారు.

●**ధర్మపురి:** ధర్మపురి మండలం కమలాపూర్ గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి మండల ఇన్‌చార్జి తహసీల్దార్ సుమన్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీనివాస్‌యాదవ్, భాస్కర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ అనిల్, సర్వేయర్ పరమేశ్వర్ పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ శేఖర్ కోరారు. మండలంలోని ముక్కట్రావ్‌పేట, శాఖాపూర్‌లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. ముక్కట్రావ్‌పేటలో 6, శాఖాపూర్‌లో 29 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ హరీష్, ఆర్ఐ రాంరెడ్డి పాల్గొన్నారు.

●**రాయికల్:** కుమ్మరిపెల్లి, తాట్లవాయి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కుమ్మరిపెల్లి గ్రామం నుంచి 49 మంది, తాట్లవాయి గ్రామం నుంచి 52 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ గణేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గిర్దావర్‌లు బి.దేవదాస్, డి.పద్మయ్య పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** వివిరావుపేటలో భూభారతి గ్రామ సభ నిర్వహించి రైతుల నుంచి తహసీల్దార్ రమేష్ దరఖాస్తులను స్వీకరించారు. వివిరావుపేట రెవెన్యూ సదస్సులో 394, వాల్గొండలో 28దరఖాస్తులను రైతులు అధికారులకు సమర్పించారు.

●**బీర్‌పూర్:** కొల్వాయి, బీర్‌పూర్ గ్రామాలలో తహసీల్దార్ సుజాత, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ సభలను నిర్వహించారు. బీర్‌పూర్ గ్రామంలో 31 దరఖాస్తులు, కొల్వాయి గ్రామంలో 51 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. బీర్‌పూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో భూ భారతి రెవెన్యూ గ్రామ సభలో కార్యదర్శి కార్యదర్శి నరేష్, ఆర్ఐ రాహుల్ కుర్చీ కోసం కొట్లాడడం వివాదాస్పదంగా మారింది.

●**పెగడపల్లి:** మండలంలోని నార్సింహునిపేట, దీకొండ గ్రామాలలో మంగళవారం తహసీల్దార్ రవీందర్, నాయబ్ తహసీల్దార్ లాస్యశ్రీల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అర్జీలు స్వీకరించారు.

●**సారంగాపూర్:** మండలంలోని బట్టపెల్లి గ్రామంలో భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సును తహసీల్దార్ ఎండీ వహీద్దీన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

●**కథలాపూర్:** మండలంలోని ఊట్‌పల్లి, పెగ్గెర్ల గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ అధికారులు భూభారతి గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ వినోద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ రమేశ్, సీనియర్ అసిస్టెంట్ సోహెల్ ఉన్నారు.

●**కొడిమ్యాల:** మండలంలోని శనివారంపేటలో గ్రామ సభ నిర్వహించగా ప్రజల నుండి 11 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు.

●**మల్యాల:** మండలంలోని సర్వాపూర్, గొర్రెగుండం గ్రామాలలో భూ భారతి గ్రామ సభలను తహసీల్దార్ వసంత ప్రారంభించారు. గ్రామ సభలలో భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించారు. డీటీ సీత, ఆర్ఐలు రాణీ, తిరుపతి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల 'సర్దుబాటు' వివాదం

(ఐదో పేజీ తరువాయి)

రిపోర్టులు, నివేదికలు సిద్ధం చేయాల్సి ఉంటుందని, ఒకరు వాటికే సరిపోతారని అంటున్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో పదోన్నతులు, బదిలీలు, నూతన డీఎస్సీతో పాటు 2008 అభ్యర్థులను తాత్కాలిక ప్రాతిపదికన తీసుకోవడంతో సర్దుబాటు అవసరం అంతగా లేకపోవచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి.

సర్దుబాటు ప్రక్రియ వాయిదా వేయాలి

-బోయినిపల్లి ఆనంద్‌రావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు



ప్రభుత్వం ఇచ్చిన సర్దుబాటు ఉత్తర్వులు జూన్ నెలాఖరు వరకు వాయిదా వేయాలి. జిల్లాలో ప్రతీయేటా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. జూన్ 18వ తేదీ వరకు బడిబాటలో నూతన ప్రవేశాలు ఎక్కువగా ఉంటాయి. జూన్ నెలాఖరు వరకు ప్రవేశాలను ఆధారంగా చేసుకొని సర్దుబాటు ప్రక్రియ చేపడితే ఫలితం ఉంటుంది.

ప్రభుత్వ పాఠశాలలపై తీవ్ర ప్రభావం

-తులసి ఆగమయ్య, టీఎస్ యూటీఎఫ్ నాయకులు, జగిత్యాల



పాఠశాలల ప్రారంభం వరకు విద్యార్థుల సంఖ్య ఎంత ఉండబోతుందనేది పరిగణనలోకి తీసుకోకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియకు ఉపక్రమించడం సరికాదు. ప్రస్తుతం విద్యా శాఖ చేపట్టిన సర్దుబాటు ప్రక్రియ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం. బడిబాట పూర్తయిన తర్వాత విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటు జరపాలి. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలపై ప్రభావం పడే అవకాశాలున్నాయి.

ప్రభుత్వ ఆదేశాల మేరకే నిర్ణయం

-రాము, జిల్లా విద్యాశాఖ అధికారి



జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఇప్పటి వరకు పలువురు ఉపాధ్యాయులు వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లోనే పనిచేస్తున్నారు. పలువురు ఉపాధ్యాయులను గత విద్యాసంవత్సరం చివరి వర్కింగ్ రోజు రిలీవ్ చేయడం జరగలేదు. సంబంధిత ఉపాధ్యాయులు ఇప్పటికీ వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో ఉన్నట్లుగా పరిగణిస్తాం.

రైతులకు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలి

-కలెక్టర్ సత్యప్రసాద్



ఈపాస్ మిషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి రూరల్, జూన్, 3 (ఆంధ్రజ్యోతి) : రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రైతులు సాగు చేస్తున్న పంట విస్తీర్ణాన్ని బట్టి ఎరువులను అందజేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. మంగళవారం మెట్‌పల్లిలోని విశాల సహకార సంఘం, గోదాంలను అకస్మికంగా తనిఖీ చేశారు. గోదాలంలోని ఎరువుల స్టాక్, రికార్డులు, ఈ పాస్ మిషన్, సహకారం సంఘం తరుపున ఇటీవల వరి ధాన్యం కొనుగోళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపుల్లో నకిలీ, నాసిరకం విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఎరువులు వల్ల రైతులు మోసపోకుండా పర్యవేక్షణ జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, వ్యవసాయ అధికారులు రమేష్, దీపిక, సీఈవో ప్రవీణ్‌గౌడ్, డైరెక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామం విత్తన స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యం

మల్యాల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రానున్న మూడు సంవత్సరాలలో ప్రతి గ్రామం విత్తన స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని పొలాస వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా.సాధ్వి అన్నారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం అనే వినూత్న కార్యక్రమం చేపట్టగా మంగళవారం మల్యాల రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సాధ్వి నాణ్యమైన విత్తనాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్, ఏఈవోలు కారుణ్యకుమార్, మంజుల, శ్రీనివాస్, కె.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు. అనంతరం మండలానికి అందించిన ముప్పై వరి విత్తన కిట్లను అభ్యుదయ రైతులకు అందజేశారు.



విత్తనాలు అందజేస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

●**కోరుట్ల రూరల్:** సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చునని పొలాస వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త పద్మజ అన్నారు. మంగళవారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలోని రైతు వేదికలో నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి నాగమణితో కలిసి నిర్వహించారు. పొలాస వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత పద్మజ పాల్గొని సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నరేష్, రాఘవేంద్ర, శ్రీహరి, ఫామీనాలు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** నాణ్యమైన విత్తనాలు సాగు చేసి వచ్చిన పంట ద్వారా ఉత్పత్తి అయిన విత్తనాలు తోటి రైతులకు అందజేయాలని వ్యవసాయాధికారులు రమేష్, దీపికలు అన్నారు. మంగళవారం నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ ద్వారా మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని రైతులకు వారు నాణ్యమైన విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవోలు భూమేశ్వర్, నరేష్, రాజు, మనోజ్ఞ, మమత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

●**కథలాపూర్ :** ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా వరి, పెసర విత్తనాలను ఏఓ యోగిత పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త పద్మజ, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ పులి శిరీషహరిప్రసాద్, ఏఈఓలు శేఖర్, హరీశ్, సంధ్యారాణి, మౌనిక, సుష్మ వివిధ గ్రామాల రైతులు ఉన్నారు.

●**గొల్లపల్లి:** గొల్లపల్లి రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో బొట్ల కరుణ, మండల నోడల్ అధికారి ప్రొ. సైనా నాయక్, వ్యవసాయ విస్తరణాధికారులు అశ్విని, సంధ్య, శివలీల, వంశీ, గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** మల్లాపూర్‌లోని రైతు వేదికలో నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే కార్యక్రమంలో భాగంగా వరి, పెసర విత్తనాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన పొలస శాస్త్రవేత్త సౌజన్య వ్యవసాయాధికారి లావణ్య, వైష్ణవి, వినీతి, గజానంద్, అనిల్, కిసాన్, జలపతిరెడ్డి, కృష్ణారెడ్డి, మల్లయ్య, రవి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

●**భీమారం:** ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ ఆధర్యంలో నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం అనే కార్యక్రమాన్ని చేపట్టింది. మేడిపల్లి రైతు వేదికలో భీమారం, మేడిపల్లి మండలాలకు చెందిన 57 మంది రైతులకు విత్తనాలను వ్యవసాయ శాస్త్రవేత్త రవి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సురేందర్, మంజుల, నరేందర్, సౌమ్య, రచన పాల్గొన్నారు.

ప్రతి రైతు రిజిస్ట్రీ చేయించుకోవాలి

పెగడపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని పెగడపల్లి మండల వ్యవసాయ విస్తీర్ణాధికారి మల్లేశం పేర్కొన్నారు. పెగడపల్లి మండలం బతికెపల్లి గ్రామపంచాయతీ వద్ద మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకునే విదానం, రిజిస్ట్రేషన్ చేయించడానికి ఏమి అవసరము, రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వలన ప్రయోజనాలు రైతులకు అవగాహన కల్పించారు. రైతులందరు ఈ కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఏఈఓ మల్లేశం కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాటిపర్తి శోభారాణి, పంచాయతీ కార్యదర్శి నిఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో వార్డు అధికారి మృతి

మెట్‌పల్లి టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మున్సిపల్ విషాదం నెలకోంది. పట్టణంలోని మూడవ వార్డు అధికారిగా పనిచేస్తున్న కట్ట హరీష్(32) మంగళవారం గుండెపోటుతో మృతి చెందినట్లు మున్సిపల్ అధికారులు, బంధువులు తెలిపారు. హరీష్ ఇటీవలే మున్సిపల్ వార్డు అధికారిగా బాద్యతలను స్వీకరించాడు. హరీష్ మృతి చెందిన విషయం తెలుసుకోని కమీషనర్ మోహన్, తోటి ఉద్యోగులు సంతాపం ప్రకటించారు.

'ప్రభుత్వ పాఠశాలలను రక్షించాలి'

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో అంతరాలను తొలగించి ప్రభుత్వ పాఠశాలలను రక్షించాలని తెలంగాణ పౌరస్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. తెలంగాణ పౌరస్పందన వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాప్త ప్రచార యాత్ర మంగళవారం జగిత్యాల పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక తహశీల్ చౌరస్తాలో నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ఏర్పాటు చేసి, తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడని, పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడు ఉండేలా చూడాలన్నారు. క్రమక్రమంగా అంతరాలు లేని బడులను ఏర్పాటు చేసి, పేద, ధనిక తారతమ్యం లేకుండా అన్ని వర్గాల పిల్లలు ఒకే పాఠశాలలో , ఒకే తరగతిలో చదువుకునే పరిస్థితులను ప్రభుత్వం కల్పించాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యకు అవసరమైన నిధుల శాతం పెంచుతూ ప్రభుత్వ ప్రాథమిక విద్యలో ప్రీ ప్రైమరీ తరగతి గదులు ఏర్పాటుకు రూ.5వేల కోట్ల ప్రత్యేక నిధులు నివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు తిరుక్కోవెల శ్యాంసుందర్, తెలంగాణ పౌరస్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంగ, రాష్ట్ర కమిటీ సభ్యులు నాగమణి, మదన్‌మూర్తి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ బాధ్యులు ఒజ్జ శ్రీనివాస్, పివి శ్రీనివాస్, ఎనుగందుల గోపి, దాసరి జయంత్, తాడూరి యాదగిరి, గడ్డల దామోదర్, తిరునగరి ప్రభాకర్ తదితరులున్నారు.

మహాలక్ష్మి ఆలయ ప్రతిష్ఠాపన

జగిత్యాలరూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామంలో శ్రీ మహాలక్ష్మీ ఆలయ ప్రతిష్టాపన కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్- రాధిక దంపతులు కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాజీమంత్రి రాజేశంగౌడ్, గ్రామనాయకులు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

పెగడపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కంబాల ఐలయ్యను మంగళవారం ఆ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ పరిశీలకులు అక్కపాక తిరుపతి పరామర్శించారు. ఐలయ్య కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు పడి కాలు విరగ్గా మంగళవారం తిరుపతి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ఓరుగంటి భార్గవ్ రామ్, రాష్ట్ర నాయకులు బత్తుల ప్రదీప్, క్యాన శంకర్, స్వామి, నరేష్ తదితరులు వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

సైకిల్ తొక్కండి..ఆరోగ్యంగా ఉండండి

మల్లాపూర్, జూన్, 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రోజు సైకిల్ తొక్కడం వలన రోగాలు రావని, ఆరోగ్యంగా ఉండవచ్చని ఖానాపూర్ సైక్లింగ్ క్లబ్ ఫౌండర్ వాల్గొట్ కిషన్ 3 జూన్ మంగళవారం వరల్డ్ సైకిల్ డే సందర్భంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణం నుండి సైకిల్ తొక్కుతూ మండలంలోని మొగిలపేట గ్రామానికి వచ్చి ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. సైకిల్ తొక్కడం వలన ఉభకాయం రాదని, రోజంతా చురుకుగా ఉంటారని, బీపీ, చక్కెర వ్యాధులు రావని, రోజురోజుకు తగ్గిపోతున్న పెట్రో ఉత్పత్తులను కాపాడుకోవచ్చని, పర్యావరణంను కాపాడుకోవచ్చని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఖానాపూర్ పట్టణంకు చెందిన రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత వాల్గొట్ కిషన్ తను పనిచేస్తున్న ప్రతి పాఠశాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూనే ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులకు తన స్వంత డబ్బులుతో విద్యా సామాగ్రిని అందజేయడం జరిగిందన్నారు. టీచర్ వృత్తితో పాటు సమాజానికి ఉపయోగపేడ అనేక సామాజిక సేవ కార్యాక్రమాలు చేస్తుంటారు.

'అంబేద్కర్ రాజ్యాంగంతోనే అందరికీ సంక్షేమ ఫలాలు'

గొల్లపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : డా. బీఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతోనే అందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహంను మాజీ మంత్రి జీవన్‌రెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళుల ర్పించారు. భారత రాజ్యాంగం వర్ధిల్లాలని, అంబేద్కర్ ఆలోచన విధానం వర్ధిల్లాలంటూ నినదించారు. అనంతరం జరిగిన సభలో లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలను సమన్వయం విద్య, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాల్లో సమావన అవకాశాలు దక్కేలా రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప దార్శనికుడు డా. బీఆర్. అంబేద్కర్ అని లక్ష్మణ్ కుమార్ కొనియాడారు. అంబేద్కర్ దేశానికి, ముఖ్యంగా నిమ్న వర్గాల అభ్యున్నతికి, సేవలు మరువలేనివన్నారు. భారత తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేసినది భారత రాజ్యాంగమేనన్నారు. ముందుచూపుతో ఆయన భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్ర కల సాకారమైందన్నారు. బహుజనుల బతుకుల్లో వెలుగులు నింపిన సూర్యుడు డా. బీఆర్. అంబేద్కర్ అని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ అన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న విప్ లక్ష్మణ్ కుమార్

అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగంతోనే తను ప్రజా ప్రతినిధిగా చట్టసభల్లోకి అడుగుపెట్టి ప్రభుత్వ విప్‌గా కొనసాగుతున్నానన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలతో పాటు భారత మాత ముద్దుబిడ్డలైన ప్రతి ఒక్కరు ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయసాధన కోసం కృషి చేసినప్పుడే మనం ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అని లక్ష్మణ్ కుమార్ అన్నారు. విగ్రహాలను నెలకొల్పడమే కాకుండా ప్రతి ఒక్కరు ఆయన చూపిన బాటలో నడుస్తూ వ్యక్తిగతంగా అభివృద్ధి చెందడమే కాకుండా సమాజశ్రేయస్సు కోసం పాటు పడాలన్నారు. అనంతరం వివిధ గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన పలువురు బాధిత కుటుంబ సభ్యులను లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ రావు, ఏఎంసీ చైర్మన్ సంతోష్, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నిశాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షులు సురేందర్, విగ్రహ నిర్మాణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు బాబూశంకర్, వివిధ గ్రామాల తాజామాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, దళితబహుజన సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రూ.2.09 కోట్లతో అభివృద్ధి పనులు

కథలాపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీలో రూ.2.09 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టాలని పాలక వర్గం ఏకగ్రీవంగా తీర్మాణం చేసింది. మంగళవారం మండల కేంద్రంలోని ఏఎంసీ కార్యాలయంలో పాలకవర్గం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మురికి కాలువలు, గోదాం, చెట్లు, పొదలు తొలగింపు, గతంలో వేసిన విద్యుత్ స్తంభాలను తొలగించి నూతనంగా స్తంభాలు ఏర్పాటు చేయడం వంటి పనులు చేపట్టాలని నిర్ణయించారు. అదేవిధంగా కేరళలో వివిధ మార్కెట్ కమిటీలను పరిశీలించి వాటిని అధ్యయనం చేయడానికి పాలక వర్గం టూర్ వెళ్ళడానికి నిర్ణయించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పులి శిరీషహరిప్రసాద్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు జయంతి

మల్లాపూర్, జూన్, 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కొమిరెడ్డి రాములు జయంతి వేడుకలను మంగళవారం నాయకులు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా రేగుంట గ్రామ శివారులో గల నివేదిత వృద్ధాశ్రమంలో పలువురుతో కలిసి కేక్ కట్ చేసినారు. స్వీట్లు, పండ్లు, బ్రెడ్‌లను పంపిణీ చేశారు. జరిపిన జయంతి వేడుకల్లో నాయకులు రైసోద్దీన్, అజిమ్‌బాయ్, బోయిని హన్మాండ్లు, రాజారెడ్డి, జలంధర్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాల అభివృద్ధి'

ఇబ్రహీపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంతో అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నియోకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మంగళవారం ఇబ్రహీపట్నం మండలంలోని వివిధ గ్రామాలలో ఇందిరమ్మ కమిటీల ద్వార ఎంపికయిన 466 మంది లబ్ధిదారులకు మంజూరి పత్రాలను పంపిణీని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగ రావు చేశారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

●మెట్‌పల్లి టౌన్: అసంపూర్ణంగా ఉన్న ట్యాంక్ పూర్తి స్థాయిలో నిర్మాణం చేసి అభివృద్ధిపై ప్రత్యేక కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగ రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జువ్వాడి నర్సింగ రావు పాల్గొని మాట్లాడారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మెట్‌పల్లి రూరల్, జూన్, 3 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేసిందని కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మంగళవారం మండలంలోని బండలింగాపూర్, జగ్గసాగర్ గ్రామాల్లోని అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు.

●మెట్‌పల్లి రూరల్ : భూ భారతి చట్టంతో ఏండ్ల నాటి రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మంగళవారం మండలంలోని విట్టంపేటలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును సందర్శించి దరఖాస్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ తిప్పిరెడ్డి అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఇబ్రహీపట్నం, జూన్3 (ఆంధ్రజ్యోతి) : మండల తహసీల్దార్‌గా భాద్యతలు స్వీకరించిన వరప్రసాద్‌ను మంగళ వారం మండల గౌడ సంఘ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసారు. వరప్రసాద్‌ను పూలమాలతో శాలువాలతో సత్కరించి అభినించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు చెట్ల చంద్రశేఖర్ గౌడ్, చర్లపల్లి సత్యానారాయణ గౌడ్, కట్ట నర్సగౌడ్, నేరేళ్ల సుభాష్ గౌడ్, బూసారపు సాయరాం గౌడ్, కట్ట ఆంజనేయులు గౌడ్, ఎలుక ఆశోక్ గౌడ్, కుంట రాజాగౌడ్, గంగానర్సయ్య గౌడ్, రాంప్రసాద్ గౌడ్, నారాయణ గౌడ్, రాజేశ్వర్ గౌడ్, శంకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

వాసవీ మాత విగ్రహ పునః ప్రతిష్ఠాపన

కోరుట్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి మాత దేవాలయంలో వాసవి మాత విగ్రహ పుణ ప్రతిష్ఠాపన మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుడు పాలెపు రామకృష్ణ శర్మ మత్రోత్సరణ మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో వాస్తు, స్థాపిత దేవత పూజలను జరిపారు. మహిళలు కుంకుమ పూజ కార్యక్రమాలను నిర్వహించి విష్ణుశాస్త్ర నామ పారయణం జరిపారు. లలిత నామ పారయణం జరిపి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అర్యవైశ్య, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ

కథలాపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ప్రాథమి, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు మంగళవారం ఉచిత పాఠ్యపుస్తకాలు మండల వనరుల కేంద్రంలో సిబ్బంది ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

ఒకటో తరగతి నుంచి 10 తరగతులకు 18,254 పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. మండలంలోని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పుస్తకాలను పంపిణీ చేసే ప్రక్రియ పూర్తి చేస్తున్నట్టు ఎంఈఓ లోకిని శ్రీనివాస్ తెలిపారు.